# శాప విమోచనం

1988 ఆల్ ఇండియా రేడియో

వియ్యంకులు కలకాలపు మిత్రులా?
జీవితకాలపు శత్రువులా?

—జయప్రద

"స్నిగ్ధా! నిన్నిప్పుడు చూడాలని వుంది రా...."

స్నిగ్ధ కళ్ళల్లోనుండి పితృ ప్రేమలాంటి నిర్మలమైన కన్నీటి బొట్టు ఆమె సుకుమారమైన చంపలమీదుగా జారి చేతిలో వున్న తండ్రి వ్రాసిన ఉత్తరాన్ని తడిపింది-

"నాన్నా!"

ఆ పిలుపు కొన్నివేల కిలోమీటర్ల దూరంలో వున్న తండ్రికి వినపడదు. ఆ పిలుపులో ఆర్తి అతనికి కన్పించదు—

కళ్ళు తుడుచుకుని మరలా ఉత్తరంలోకి చూసింది. స్నిగ్ధ.

"నా మనస్సులాగ నా శరీరం అంతవేగంగా నీ దగ్గరకు రాలేదు కదమ్మా. నేనంత దూరం విమానం ఖర్చులు పెట్టుకుని రాలేని పేద బడి పంతుల్నయిపోయానమ్మా లేకపోతే ఇలాటప్పుడు నీ దగ్గరకు రాకుండా వుండే శక్తి నాలో వుందా!"

ఆమె కన్నీరు తెగిన ముత్యాల సరమైంది. ఉత్తరాన్ని మూసి ఖరీదయిన అమెరికాలో, ఖరీదయిన కార్పెట్ మీద ఇంకా ఖరీదయిన సోఫాలోనే బోర్లా పడుకుని తన కన్నీళ్ళకు తన ఓదార్పుతోనే తుడుచుకోవడానికి ప్రయత్నిస్తోందామె.

ఆ కన్నీళ్ళు కరాటే క్లాస్ కెళ్ళిన తన భర్త తిరిగి వచ్చేలోపల ఇంకిపోవాలి. ఆ కన్నీళ్ళు మరే కారణంవల్లనయినా రావచ్చుంటే ఓదార్చే మనస్సు అతనికుంది. అతను భార్యను అపురూపంగా చూసుకునే భర్తే కానీ, ఆ కన్నీరు ఆ భార్యను కన్నతండ్రి ప్రేమకోసం రాకూడదు ఆమె కంట్లో.

"అది తప్పు నేవింకేం నిషేధాలు పెడుతున్నాను నీకు?" అని భార్యను ప్రశ్నించే భారతీయ సంస్కృతిని జీర్ణించుకుని పరాయిదేశపు నాగరికతను శరీరానికి పులుముకున్న చదువుకున్న మూర్ఖుడతను.

భార్యకు కావాల్సింది తను కొనిచ్చే రకరకాల డ్రసెస్, వంట నిముషంలో తయారయ్యేలా రకరకాల కొత్త కొత్త పరికరాలు మాత్రమే కాదనీ తను పెళ్ళయ్యేదాకా ప్రేమించబడ్డ తల్లిదండ్రుల ప్రేమకూడా ఆమెకు కావాలనీ, తిరిగి ఆ ప్రేమను వాళ్ళకు పంచే స్వతంత్రం కావాలనీ దానిని అతను నిరోధించడం తప్పనీ అతనికి చెప్పినా తెలియకపోవడాన్ని ఏమనాలి?

అమాయకత్వమా? అవివేకమా? అహంకారమా? అనాగరికమా?

స్నిగ్ధ లేచి కూర్చుంది. తన చేతులతోనే కారే తన కన్నీరు

తుడుచుకుంటున్నా ఆ కన్నీరు కారుతూనే వుంది. ఆ కారే కన్నీటితో తన పేద తండ్రి ప్రేమ బరువు వుంది.

ఈసారి చుడీదార్ మీదున్న చున్నితో గట్టిగా కళ్ళు తుడుచుకుని ఉత్తరంలోకి చూసింది — అక్షరాలు మసక మసకగా కనిపిస్తున్నాయి.

"అమ్మా! స్నిగ్ధా! మన ఇండియా డబ్బుతో 300 రూపాయలకు ఒక చీర కొనుక్కోమ్మా. ఆ మూడొందలు మీరెప్పుడయినా ఇండియాకు వచ్చినప్పుడు మీకు లేదని కాదనుకో. అదో తృప్తి నాకు. ఆ డబ్బు మీకిస్తాను.

ఆమెకిక ఆ ఉత్తరం చదివే శక్తి లేకపోయింది. తండ్రి నిస్సహాయ ప్రేమను తాగి తాగి ఆమె గుండె నిండిపోయింది.

"నాన్నా! నేను నీకేమి ఇవ్వగలను?" ఆమె కళ్ళు మరలా వర్షించాయి.

బరువెక్కిన గుండె ఆ ఉత్తరాన్ని చదవనీయకపోయినా తన మాతృదేశంలో వున్న తండ్రి ఎంతో ప్రేమగా వ్రాసిన ఆ ఉత్తరంలో మిగిలిపోయిన నాలుగు ప్రేమ ముక్కలు చదవకుండా వుండలేకపోయింది ఆమె మనస్సు.

"మూడువందలకే కొనుక్కోమని వ్రాస్తానని ఏమీ అనుకోకమ్మా. నా పించను డబ్బులతో సంసారం ఈదడమే కష్టంగా వుంది. ఆపైన గుండెలమీద కుంపటిగా నీ చెల్లెలు. నీలా చదువుకోనయినా చదువుకుంది కాదు..."

"వద్దునాన్నా నాలా చదువుకోకూడదు. చాలా అందంగా వుండకూడదు. అలా లేకపోవడమే స్వప్న చేసుకున్న అదృష్టం లేకపోతే చదువుకుంది, సంపాయిస్తుందనీ అత్తమామలు, అందంగా వుందని ఏ ఐశ్వర్యవంతుడయిన పెళ్ళికొడుకో వస్తే... కట్నం ఇవ్వడానికి రిటైర్

అయ్యాక వచ్చిన జిషియఫ్‌మనీ నా కిచ్చేసావు కనక లత ఐ.సి.మనీ వస్తుందని నీ ప్రాణాలయినా నువ్వు తీసుకుని స్వప్ననే నాలా యిదో ఇలాటి గొప్ప బ్రతుకునిచ్చి నువ్వు మాత్రం పనికిరాని సత్తుకాయిన్ లాగ ఆ అల్లుడి దృష్టిలోకూడా మిగిలిపోయుండేవాడివి.

వద్దునాన్నా గః ఆడంబరాల బ్రతుకులు మా కొద్దు జీర్ణించుకో శేని భర్తల అతిప్రేమలు మాకొద్దు. మా భర్తలతోపాటు మీ ప్రేమకూడ మిగలాలి. నాకా అదృష్టం ఎలాగూలేదు. స్వప్నకు దాన్ని దూరం చేయకు నాన్నా!..

భారతదేశంలో ఒక బడిపంతులు కూతురు పి.హెచ్.డి చేసి అమెరికాలో ఉద్యోగం చేసుకుంటూ ఒక పెద్ద బంగళాకి ఓ పొడువైన కారుకి ఖరీదయిన భర్తకు స్వంతమైన సంపన్నురాలు. ఇలా బాధ పడేలా చేస్తున్న పరిస్థితులు ఎంత హేయమైనవి!

మరలా ఉత్తరంలోకి చూపు సారించబోయిన ఆమెకు సెంట్రల్ ఎ సి. లీడింగ్‌రూమ్ తాలూకు డోర్ క్లోజర్ వున్న ఉడెన్ డోరు తెరుచుకోవడం కనిపించింది.

ఆ ఉత్తరం దాచేయడానికామెకు టైమ్ చాలకపోయింది. మెత్తటి కార్పెట్‌మీద ఠీవిగా నడుస్తూవచ్చి భార్య ప్రక్కన కూర్చుని ఆమె భుజంచుట్టూ ప్రేమగా చెయ్యివేసిన రాజీవ్ చురుకయిన కళ్ళు ఆ ఉత్తరం ఎక్కడనుండి వచ్చిందో యిట్టే గ్రహించాయి. అతని కనుబొమలు ముడిపడ్డాయి.

స్నిగ్ధ తలవంచుకునే వుంది కానీ ఆమె మనోనేత్రాలు మాత్రం అతని ముఖభావాన్ని చూసింది.

అతని హైసెన్సిటివ్‌నేచర్ ఆమెకు తెలుసు. తన భార్యను మరెవ్వరూ ప్రేమించకూడదు. స్నిగ్ధ నిశ్శబ్దంగా ఆ ఉత్తరాన్ని భర్తచేతిలో పెట్టింది.

అతనుకూడా ఏమీ మాట్లాడలేదు. పూర్తిగా ఉత్తరం చదివి ఆమె

అరచేతిలో విసురుగా వుంచి ఓ నవ్వు ఆమెమీదకు విసిరి చ్చిన బాణం వదిలి వెళ్ళిపోయాడు.

"కొనుక్కో మరీ మీ నాన్న ఇచ్చే పదిహేను డాలర్లకు ఓ మంచి చీర కొనుక్కో."

అతను నవ్వే నవ్వులో వ్యంగ్యం. మాట్లాడిన మూడు ముక్కల్లో మనిషిని పాలించే డబ్బుమీద ఆశ—అతను ఆమెకు బాగా అర్థమయ్యాడు.

★ ★ ★ ★

"చెల్లెమ్మా! స్నిగ్ధకు ఏడో నెలట దాన్ని కాన్పుకు పంపమని అల్లుడికి ఫోన్ చెయ్యమ్మా!"

"చాలా వినయంగా యజమానిదగ్గర వెట్టిచాకిరీ చేసేవాడు చూసే చూపుకంటే దయనీయంగా చూస్తూ అర్థించాడు కృష్ణమూర్తి తన వియ్యపురాల్ని.

ఆమె అతనివేపు విసుగ్గా చూసింది.

అ తర్వాత తనకొచ్చిన కోపాన్ని నిగ్రహించుకుంది.

"మీరేమీ తినలేదు" అంది ఏమయినా ఆతనీరోజు తనింటికొచ్చిన అతిథి కదా!

చుట్టూ చూసుకున్నాడు కృష్ణమూర్తి. స్నిగ్ధను, స్వప్నను కన్న ఆడపిల్లల తండ్రి అతను. తనచుట్టూ పరుచుకున్న ప్లేట్లల్లో బాదం హల్వా, జీడిపప్పు కేక్, రసమ్మలై, స్పెషల్ పకోడీ, చికెన్ కట్లెట్, ఎగ్ పఫ్ ఇవికాక చికెన్ కార్న సూప్, ఐస్క్రీమ్, దూరంగా సర్వెంట్ చేతిలో తనకింకా ఇవ్వకుండా మిగిలిపోయిన టీ.

హోదా నిలుపుకోవడం కోసం అభిమానాన్ని ప్రేమని నిర్విష్

ధారంగా పోగొట్టుకోగల వ్యక్తి ఆమె. ఇద్దరు మగబిడ్డల్ని కని ఐశ్వర్య వంతురాలయిన అదృష్టపు తల్లి ఆమె.

ఆమె పెట్టిన ఇన్నిట్లో ఒక్కటే ఒకటి తను కొనుక్కోగలిగింది. అది టీ ఒక్కటే. మిగతావన్నీ పెన్షన్ చేతిలో వున్నా కొనుక్కోలేనివి. ఎంత చిత్రం! అవేమీ తనని ఊరించడంలేదు. వాటిని చూస్తుంటే అసలు ఆకలి చచ్చిపోయినట్లుంది. తనకు తెలుసు ఇలా పెట్టిన తన వియ్యపు రాలు మరో నిముషంలో తనని తిడుతుందని-

"వద్దమ్మా! ఇప్పుడే టిఫిన్ చేసి వచ్చాను. వద్దంటే వింది కాదు స్వప్న నాలుగు పెసల దోసెలు, గుప్పెడు ఉప్మా తినేదాకా వదిలింది కాదు ఆ టీ ఇలా ఇవ్వమ్మా!"

నిజానికి గంట పదకొండయినా అతనింకా పరగడుపునే వున్నాడు. ఈ పెద్ద సమస్య తీరేదాకా అతనికి పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టుకోవాలనిపించడం లేదు.

ఏమి తంత్రులో! కూతురు అమెరికాలో హాయిగా భర్తతో సంసారం చేసుకుంటూ, సర్వసౌఖ్యాలు అనుభవిస్తుంటే తమ మనసులు, పొట్టలుకూడా కాల్చుకుంటారెందుకో వీళ్ళు!

టీ త్రాగుతున్నారాయన. టీ తాగుతూ ఎలా అడిగితే ఆమెకు కోపం రాకుండా వుంటుందో ఆలోచిస్తున్నారు.

ఒకవేళ కోపం వచ్చి ఒక మాటన్నా ఎలా ఓర్పుగా వుండాలో మనసుల్లోనే రిహార్సల్స్ వేసుకుంటున్నారాయన.

ఆమె కూర్చోలేదు ఎదురుగా నిల్చొనుంది. ఎంతయినా తన కంటే పెద్దవాడు కదా! మనది భారతీయ సంస్కృతి మరి.

టీ త్రాగడం పూర్తయ్యాక అతనికి నీరసం వచ్చింది. ఇంకా యుద్ధానికి సంసిద్ధుడు కావాలి. అవతలి సైన్యం బలమైంది. తను నిరాయుధుడు.

"అమ్మా! స్నిగ్ధను కాన్పుకు పంపించమని అల్లుడుగార్కి నన్ను ఫోన్ చెయ్యమంటారా?"

"అది మీ ఇష్టం." అలా నిల్చున్న భారతీయత భుజాలచుట్టూ కప్పుకున్న పైటకొంగు సిగ్గుపడింది.

"నా ఇష్టం ఏముందమ్మా మీరు చేసినా, నేను చేసినా...."

ఇక అతనికి భయమేసింది ఏమి మాట్లాడితే ఏమొస్తుందోనని—

"నేను ఫోన్ చేసేదేవిటి? మీ బిడ్డను మీరెళ్ళి కాన్పుకు తీసుకొచ్చుకోవాలిగానీ, నేనుగాని కడుపు సారె పెట్టమన్నానా? చీరలు సారెలు తెమ్మన్నానా?"

కృష్ణమూర్తి మనసులోనే గొణుక్కున్నాడు.

"కడుపు సారె పెట్టడానికి ఓ బిడ్డను కనబోతున్న తనబిడ్డ ఈ దేశంలో వుంటే కదా!" దాన్నే ఇంకోరకంగా మర్యాదగా, వినయంగా మనసు, చేతులూ రెండూ కట్టుకుని ఇలా అన్నాడతను.

"నిజమేనమ్మా! కానీ స్నిగ్ధ ఈ దేశంలో వుండుంటే...."

"ఏం పరాయిదేశంలో వుంటే మాత్రం కన్నబిడ్డను కాన్పుకు తెచ్చుకోరా?"

"అంత శక్తి నాకు...."

"అంత ముద్దుముచ్చట్లు తీర్చలేని వాళ్ళు ఫారిన్‌లో వున్న అల్లుడి కోసం ఆశపడాల్సింది కాదు"

"నేనాశపడ్డానా? మీరే వచ్చి చచ్చి ఏ స్వర్గాన వుందో నా భార్య గడ్డం పట్టుకుని బ్రతిమిలాడి నా కూతుర్ని చేసుకున్నారా?" అని అడగాలని నోటిదాకా వచ్చిన వాక్యాన్ని గుండెల్లో సమాధి చేసుకున్నాడు కృష్ణమూర్తి. అతను ఆడపిల్ల తండ్రి.

"ఒకవేళ ఆశపడుంటే ఆ ఆశ మీది. మీరాశపడ్డంతో కట్నంగా నాకొచ్చిన జి.పి ఎఫ్. అంతా ఇచ్చాను కదా!" అని అడగాలనుకున్న అతని గుండె-ఆగిపోలేదుకానీ కాస్సేపు స్పృహ కోల్పోయింది. తర్వాత అతని మేధస్సు పని చేసింది. అంటే....అంటే ఆమె ఉద్దేశం తన డబ్బుతో తన కూతురు తన దేశానికి రావాలి" నిట్టూర్చాడు.

అంటే తన డబ్బుతో చదువుకుని పి. హెచ్.డి. చేసే ఆ డాక్టరేట్ డిగ్రీతో వేల డాలర్లు సంపాయిస్తున్న తన కూతురి డబ్బుతో తన కూతుర్ని ఇండియాకు తీసుకురాకూడదన్న మాట.

"అలాగేమ్మా! ఫోన్ చేసి అల్లుడిగార్ని, స్నిగ్ధను రమ్మని చెప్తాను."

"వాడికెక్కడ తీరుతుంది?"

"నిజమేలేమ్మా. టిక్కెట్టుకి మీ దగ్గర డబ్బిస్తాను. అల్లుడిని అక్కడ టిక్కెట్ కొని స్నిగ్ధను పంపించమని మీరుకూడా చెప్పండి."

"సాంప్రదాయం గల ఇంటికోడలు ఒక్కతే ఎలా వస్తుంది?"

మరో బాణం- ఎంత రాక్షసత్వం!

ఆమెకు బాగా తెలుసు. తను వెళ్ళి బిడ్డను తెచ్చుకోలేడని. ఎలా అయినా తనని నొప్పించాలి అంతే.

ఎలా అయినా బ్రతిమిలాడుకునో, కాళ్ళు పట్టుకుని అల్లుడు, కూతురు సంపాదించుకుంటున్న చాలా డాలర్లలో కొన్నిడాలర్లు ఖర్చు పెట్టించి తన కూతుర్ని వాళ్ళ డబ్బుతో తన మాతృభూమికి, పేద పుట్టింటికి తీసుకొచ్చేలా ఆమెను ప్రసన్నం చేసుకోవాలనుకున్న కృష్ణమూర్తికి ఆమె కాళ్ళు పట్టుకోలేదు. ఆ టిక్కెట్టుకయ్యే నలభయ్ వేలు ఖర్చు మిగిలితే పెద్దకూతుర్కిలా రెండో కూతురికి సారెచీర పెట్టకపోయినా కట్నంకోసముగా నయినా పనికి రావచ్చనే దురాశతో వచ్చిన

అతను తన అభిజాత్యాన్ని చంపుకోలేక కూతురుకి తనే టిక్కెట్టు కొనడానికి సిద్ధపడ్డ ఆ పేద ఆత్మాభిమానికి గుండె అదిరిపడింది. తను వెళ్ళి తను తన పెద్దకూతురుతో తిరిగి రావడానికి కొనే అందమైన ఫ్లయిట్ టిక్కెట్టు ముక్కలకు తన దగ్గర డబ్బుందా? తనని అమ్ముకుంటే మాత్రం అంత వస్తుందా? వాళ్ళకి తెలియదా తనేమిటో, తన ఆర్థిక స్తోమతేమిటో....

"ఇంతలా డబ్బుకు చూసుకునే వాళ్ళు పెద్ద సంబంధాలు చేసుకోకూడదు"

ఆడవాళ్ళు సున్నితులు అంటారే అలాటిదీమె ఎంత నిర్దయగా తనని నొప్పిస్తోంది?

భారత స్త్రీ ఎంత దిగజారి పోతోంది? అయినా తను ఏనాడూ పెద్ద సంబంధాలకు ఆశపడలేదు.

"మీ అమ్మాయి మాకు నచ్చింది మీరెంత ఇచ్చినా చాలు" అని అంటే వాళ్ళ దొడ్డబుద్ధికి సంతోషించి వాళ్ళకి వాళ్ళ అయినవాళ్ళల్లో చిన్నతనం కాకుండా....తన చిన్నకూతురి వయస్సు, తన కరిగిపోతున్న ఆరోగ్యం, అయిపోయిన ఉద్యోగం గురించికూడా ఆలోచించకుండా ఎంతో అపురూపంగా పెంచుకుని కూడా అమెరికాకు వెళ్ళే అల్లుడయితే చిన్న చిట్టితల్లి తనకు దూరమయిపోతుందని తెలిసీ సంస్కారవంతులయిన వాళ్ళ నీడలో స్నిగ్ధ సుఖపడితే చాలని తను ఆ పిల్లను వాళ్ళ దోసిట్లో ధారపోసాడు చూడూ అదీ తను ప్రథమంగా వేసిన తప్పటడుగు-

"మీ ఇష్టం మీ అమ్మాయి మీరేం చేసుకుంటారో నాకెందుకు మధ్యలో" ఆమె మరలా అంది నిష్ఠూరంగా.

వెర్రిగా చూసాడు కృష్ణమూర్తి.

ఆమె ఇప్పుడు పలికిన వాక్యంలో ఆ పదాల్ని ఎంతందంగానయినా చెప్పొచ్చు-

"మీ అమ్మాయి అన్నగారూ! మీ ఇష్టం మీ అమ్మాయిని మీరు పెళ్ళిచేసుకునే దానికి నాకెందుకు చెప్పడం!" అని కాస్త సున్నితంగా చెప్పొచ్చు లేదా అవతలి వాళ్ళు నొచ్చుకుంటారేమో లేక అలా తను మాట్లాడితే తనని మరోలా భావిస్తారేమో అని అనుకునే వాళ్ళయితే ఇంకా ఇంకా అందంగా ఇలా చెప్పొచ్చు.

"భలేవారే అన్నయ్యగారూ! మీ అమ్మాయిని మీరు తీసుకొచ్చే దానికి నా పర్మిషన్ కావాలా?"

కానీ ఆమె అలా అనదు.

వెర్రిగా చూస్తూ లేచి నిలబడ్డాడతను. తను ఇక ఒక్కక్షణం కూడా అక్కడుండాలనిపించలేదతనికి.

ఆమెను అడగాల్సిన ప్రశ్నలు అతని మెదడు పొరల్లో చేరి బయటకు రావడానికి తొందర పెడుతున్నాయి.

"నేనంతగా కట్నాలిచ్చుకోలేనని ఆ రోజే చెప్పానుకదా!"

"నాకింకో అమ్మాయుందని మీకు తెల్సు కదా!"

"నాకు పించనుతప్ప మరే ఆధారమూలేదని మీరు ఎరుగుదురు కదా!"

"నా బిడ్డకు పచ్చడి మెతుకులు పెట్టినా చాలు నా బిడ్డ నా కళ్ళ ముందే వుంటే బావుణ్ను" అని నేను నా అభ్యంతరాన్ని తెల్పింది మర్చిపోలేదు కదా!

ఇలాగ సవాలక్ష

తనెక్కడ తొందరపడి ఆ ప్రశ్నల్లో ఏ ఒక్క ప్రశ్నవేస్తాడో ఆ ప్రశ్న ఆమెలో ఆత్మపరిశీలనకు తావివ్వదు సరికదా! ఇండియానుండి అమెరికాకు ఫోన్‌లో తన కొడుక్కి తన మీద నేరాలు జాబితా వెళ్ళిపోతుంది.

ఆ తర్వాత తన చిట్టి తల్లి శాశ్వతంగా తన ఒళ్ళోకి వచ్చేస్తే ఇక అమ్మో! రెండో మాట మాట్లాడకుండా చేతులు జోడించి తను ఇరవై ఐదు ఏళ్ళు పెంచుకుని మరో డెబ్బై ఏళ్ళు ఆ ఇంట్లో గడపమని తన కూతుర్ని ఆశీర్వదించి పంపిన ఆ ఇంటి గడపదాటేసాడు.

* * * *

స్టేట్స్‌కి కాల్ బుక్ చేసి అదిరే భావాలతో ఎదురు చూస్తున్నాడు కృష్ణమూర్తి.

అల్లుడు తన భుజాలమీద బుల్‌డోజర్‌లాటి ఏ బరువు పెడ్తాడో అని భయపడుతూ, ఆలోచిస్తూ, విచారిస్తూ స్నేహితుడింట్లో ఫోన్ ముందు కుర్చీలో నీరసంగా కూర్చొనున్నాడతను.

"నీ కాల్ ఇస్తున్నట్లున్నారు లైన్‌లో వుండు" ఫోన్ రింగవుతూనే లిఫ్ట్‌చేసి ఎక్స్‌చేంజ్ లైన్‌లోకి రాగానే స్నేహితుడికి అందించి తను లోపలికెళ్ళిపోయాడు కృష్ణమూర్తి స్నేహితుడు భార్గవ్— అతనూ మధ్య తరగతి మనిషే అతనికీ ఈ బాధలు తెలుసు—మనం మంచి వాళ్ళమై సంసారంగా బిహేవ్ చేస్తే చాలదు అవతలి వ్యక్తి కూడా అలాటి వాడయ్యుండాలి— లేకపోతే ఈ బాధలు తప్పవు అనే సత్యం తెలిసిన వ్యక్తి అందుకే తన స్నేహితుడికి ప్రైవసీ ఇస్తూ లోపలికెళ్ళాడు.

"నాన్నా!" అవతలి నుండి ఎంత కాలానికి వింటున్నాడు తన బంగారుతల్లి గొంతు ఎప్పుడయినా తనని నొప్పించి ఎరుగునా? యిలా తన ప్రమేయం——లేకుండానే తనని నొప్పిస్తున్నాననే బాధ పాపం ఆ పిల్లకి తొలిచేస్తున్నట్లుంది అలా అని స్నిగ్ధ ఉత్తరాలు చెపుతూనే వున్నాయి-తను తిరిగి ఉత్తరం వ్రాసి ఓదార్చడానికి లేకపోయె ఆ ఉత్తరంలో క్షేమ సమాచారాలు తప్ప మరేది వ్రాసినా అల్లుడి మనస్సు అపార్థాలను సృష్టించుకుంటున్నదామె.

"నాన్నా! నేను స్నిగ్ధని!"

ఉలిక్కిపడ్డాడు కృష్ణమూర్తి అనవసరంగా అరనిమిషం వేస్ట్ చేసి తన జేబులో డబ్బు వృథా చేసుకున్నాడు.

"బాగున్నావామ్మా అల్లుడుగారు బాగున్నారా? ఆ రెండో వాక్యం వాడకపోతే మర్రే ఫోన్ కనెక్షన్‌లోనయినా అతను వింటే యింకేమైనా వుందా? తనని అలక్ష్యం చేస్తామని అలగడూ!

అల్లుడు బాగున్నాడామ్మా? అని అడగడం మామగార్కి ఎంత ఇష్టమైన విషయం! ఇప్పుడెందుకింత భారమైందది తన గుండెల్లో?"

"బాగున్నారు నాన్నా—స్వప్న బాగుందా?" స్నిగ్ధ ఇంత స్వతంత్రంగా తమ యోగక్షేమాలు అడుగుతుందంటే అల్లుడు యింట్లో లేడన్న మాట అదే అడిగాడు కృష్ణమూర్తి.

"ఉన్నారు నాన్నా పిలవనా?" ఎక్కడ నాన్న వద్దంటాడో అని హడావుడిగా భర్తను పిలిచింది స్నిగ్ధ ఆమె గొంతులో కంగారు స్పష్టంగా ఇన్ని వేల కిలోమీటర్ల దూరానికి విన్పిస్తోందంటే ఆమె టెన్షన్ అలాటిది—

రాజీవ్ లైన్‌తో కొచ్చాడు.

"బావున్నావా నాయనా? అమ్మాయి బాగుందా?" అలా అడిగిన కృష్ణమూర్తి మనస్సులోనే గతుక్కుమన్నాడు మొదటి పదం వదిలి వూర్కోవచ్చు కదా అమ్మాయి బాగుందా? అని అడగడం ఎందుకు తను "మీ అమ్మాయిని నేనేం కష్టాలు పెట్టడం లేదిక్కడ అని అతను బాధపడేట్లు స్ఫురించేలా-

"బావున్నాము."

రెండో ప్రశ్నకి వెతుక్కోవాల్సి వచ్చింది తనకి.

"జాబ్ సాటిస్‌ఫాక్షన్ బావుందా బాబూ!"

"నేను జాబ్ మానేసానని మీ అమ్మాయి చెప్పలేదా?"

కంఠంలో కోపం-

వణికిపోయాడు కృష్ణమూర్తి. ఇన్ని మార్లు రిహార్సల్స్ వేసు పని ఆ ప్రశ్న తను వేయడమేమిటి? అమెరికాలో చలి ఎలా వుందని అడిగితే పోయేదికదా!

మాట్లాడే ప్రతి అక్షరానికీ అపార్థాలు తీసే అల్లుడని తనకి తెలుసుకదా!

"లేదు....అమ్మాయితో ఇంకా మాట్లాడలేదు" అనిఆగాడు మరేం చేస్తున్నావని అడిగితే తప్పా? అడక్కపోతే మంచిదా? అని క్షణం ఆలోచించాడు యిలా ఆలోచిస్తూ కూడా అతను రాబోయే ఫోన్ బిల్ గురించి భయపడుతున్నాడు.

మాట్లాడితే అపార్థం చేసుకునే వాళ్ళలో మాట్లాడకుండా ఊరుకోవడమే మంచిది కదా!" మరి స్నిగ్ధ సంగతి అడగాలి కదా! ఎలా మొదలెట్టాలి?

"స్నిగ్ధను పిలుస్తాను."

పిలవమని చెప్పాలని అతని శరీరంలోని నాడీ మండలంలో ప్రతి అణువూ అలపిస్తోంది కానీ స్నిగ్ధ తను మాట్లాడకపోయినా ఏమీ అనుకోక కాకపోతే ఇంకొక్క మాటయినా స్నిగ్ధతో మాట్లాడకుండా ఫోన్ పెట్టేస్తే తన మనస్సు చాలా నిరాశపడుతుంది. రోజుల తరబడి బాధ పడుతుంది కానీ కూతురితో మాట్లాడకపోతే మరోలా భావించే అల్లుడితోనే మాట్లాడాలి తప్పదు.

ఇది ఇల్లా? కల్లుకొచ్చి ముంతదాచడానికి సెకండ్లు గడిచేకొంది పదిరూపాయలనోట్లు జేబులోనుండి ఎగిరి పోతాయి.

"రాజీవ్ స్నిగ్ధని పంపితే కాన్పు చేయించి పంపుతాను నాయనా"

"ఇక్కడ చేయిస్తానులెండి"

అల్లుడి ఆ మాటవిన్న అతని మనస్సు కొన్ని కేజీల బరువును దింపుకుంది తన కూతుర్ని కాన్పు పేరుతో చూడొచ్చని ఆశపడ్తున్న అతని మనస్సు మరోమూల నిరాశపడ్డ మాట వాస్తవమే అయినా తన అల్లుడు తనకు మొదటిమారు ఇన్నివేల రూపాయల ఖర్చుని మిగిల్చా డంటే అది ఎంత ఆనందించాల్సిన విషయం.

"నీ ఇష్టం నాయనా!"

అవతల దీర్ఘ నిశ్శబ్దం.

"స్నిగ్ధని ఒకమారు పిలువు బాబూ!" అని అర్థించాలనివుంది. తనకు చెప్పకూడదని రహస్యాలేమిటో తన భార్యకు తను చెప్పేసినట్లు విపరీతంగా బాధపడి తన కూతుర్ని కష్టపెట్టిన సంఘటనలు గుర్తుకొచ్చి ఆ సాహసం చేయకుండా అల్లుడికి థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేసిన ఆ బడిపంతుల గుండెల్లో ఏదో ముల్లు గుచ్చుకున్న భావం—

తండ్రి కూతురితో మాట్లాడాలనీ మాట్లాడలేని దౌర్భాగ్యపు క్షణాలు ఎంతో హీనమైనవి. తనలో ఎలాటి తప్పు లేకపోయినా క్షణం క్షణం ఏదో తప్పు చేసిన కృత్రిమభావంతో అణిగి మణిగి వుండడం మనసున్న మనిషికి అదెంతశిక్ష ? ఎవరు వేసారీశిక్ష ? అబ్బాయి తల్లి దండ్రులకు అమ్మాయి తల్లీ తండ్రీ లొంగి వుండాలనే ఈ సాంప్ర దాయం ఎప్పుడు పుట్టింది ? ఎన్ని దశాబ్దాలనుండి టానిక్కులు తాగి పెరుగుతోందది. ఇలాటి రాక్షస సాంప్రదాయాల్ని చదువుకున్న వాళ్ళు కూడా పాటించడం ఎంతనైచ్యం ?

ఆయన గుండె పొరల్లో పారే రక్తం మరిగి పోతోంది.

"మాట్లాడావా?" స్నేహితుడు లోపలనుండి వచ్చి అడిగాడు.

"ఊఁ మాట్లాడాను"

"ఏమన్నారు?"

"అక్కడే కాన్పు చేయిస్తాడట" అలా అన్న స్నేహితుడి ముఖంలో భావాలవంక నిశ్శబ్దంగా చూస్తున్నాడు భార్గవ్.

"నాకు సంతోషమయింది భార్గవా"

అతను మాట్లాడలేదు.

ఏ తండ్రీ బిడ్డ కాన్పుకి ఖర్చు అవుతుందని బాధపడడు. ఆ ఖర్చు తన స్థితిని మించిపోతే తప్ప-.

భార్గవ నోటినుండి రావాల్సిన శబ్దం నిశ్శబ్దమై పోయిన క్షణాలవి.

★ ★ ★ ★

నాన్నా!

నా ఉత్తరాలేవీ నిన్ను సంతోషపర్చవని నాకు తెల్సు. అలాటి ఉత్తరాల్లో ఇదొకటి. మీ అల్లుడుగారు నాకు చెప్పిన దానికి ప్రింట్ ఇది ఇది నా భాషకాదు. ఇది నా భావంకాదు. అయినా మిమ్మల్ని నొప్పించే ఈ ఉత్తరం ఎందుకు వ్రాస్తున్నానంటే ఇకనయినా నా భారం మీకు తప్పించాలని, అర్థం కాలేదా నాన్నా.

మీ అల్లుడుగారు నా కాన్పుకయినా 25 వేల డాలర్లు మిమ్మల్ని మా అత్తగారికి చేర్చమని నన్ను వ్రాయమన్నారు. మీకు ఆయన నన్ను వ్రాయమన్న తొలి ఉత్తరం ఇది.

ఆయన గుండె గొంతులో కొచ్చింది.

25 వేల డాలర్లు-అవి ఇరవై వేలుకాదు ఎక్కడన్నా గుండె రాయి చేసుకుని చేయడానికి.

మరలా ఉత్తరంలోకి చూసాడు.

నాన్నా మీ అల్లుడుగార్కి మీరిలా వ్రాయండి.

"నా కూతురి సర్వ ఖర్చులు నేను పెట్టుకోవాల్సి వస్తే నా దగ్గరకు పంపెయ్యి. లేదా నీ దగ్గర నా కూతుర్ని వుంచుకోదల్చుకుంటే. ఆమె కయ్యే ప్రతి ఖర్చు నువ్వే పెట్టుకో. ఆమెను నా కూతురిగా మిగలనివ్వలేదు. నీ భార్యగానయినా మిగుల్చుకో."

నాన్నా! నేనిలా వ్రాసానని బాధపడకండి. నా మనస్సులో మీరు, మీ స్మృతిలో నేను ఎల్లకాలం వుంటాం. ఇలా అప్పుడప్పుడు మీకెలాటి ఆనందం తృప్తి దొరకని ఖర్చు మీచేత పెట్టించడం నా కిష్టంలేదు. అందుకే ఫోన్ కూడా చేయకండి. నేను మాట్లాడడానికి లేదు.

అర్ధమయిందా నాన్నా! మీరు నాకోసం నా పెళ్ళయ్యాక సాంప్రదాయాల పేరిట చాలా ఖర్చు చేసారు. ఏ ఖర్చు మీకుగానీ నాకుగానీ సంతోషాన్ని మిగల్చలేదు. చెప్పండి నాన్నా! కన్నీళ్ళు ఎలాగూ తప్పనప్పుడు ఖర్చయినా మిగుల్చుకుంటారనే ఆశతో వ్రాస్తున్నాను నాన్నా! మీరు నామీద బాధపడరని నాకు తెల్సు. మీ మనస్సూ బాధపడ్తుంది.

కానీ ఇది ఒకే బాధ నాన్నా! క్షణం క్షణం నాతో మాట్లాడాలనీ, మాట్లాడలేని మూగ బోయిన మీ గొంతు మీకిచ్చే బాధకంటే వ్రాయాలనీ, ఏదీ స్వతంత్రించి వ్రాయలేని మీ కలం మీకిచ్చే బాధకంటే, నన్ను చూడాలనీ చూడలేనంత దూరంలో వున్న నేను మీకిచ్చే బాధకంటే, ఈ బాధ నయంకదూ నాన్నా.

ఇక ఆ ఉత్తరం చదివే శక్తి అతని కళ్ళకు లేకపోయింది. ఆ కళ్ళనిండా మగవాడు సిగ్గుపడే కన్నీరు.

ఆయోమయం అంధకారం క్షణంసేపు తర్వాత తేరుకున్నాడతను.

ఇంతకీ తన కూతురు తనను తనతో బంధాలు తెంచుకోమని చెప్పి శాప విమోచనం కలిగిస్తోందా? లేకఅన్నిలక్షలు తను కట్టలేని పరిస్థితుల్లో, తన భర్తని వదిలేసి వచ్చి తన ఒడిలో శాశ్వతంగా వుండి తనను శాపగ్రస్థుణ్ని చేస్తోందా.

లేదు లేదు తన కూతురు ఆ లక్షలన్నా కట్టండి లేదా నన్ను మీ దగ్గర కన్నా తీసుకెళ్ళండి. అని తనకు ఛాయిస్ యివ్వడంలేదు. తను తన స్టూడెంట్స్‌కి ఛాయిస్ ఇచ్చినట్టు ఆ ఛాయిస్ ఏదో తన భర్తకేఇచ్చి పిచ్చిపిల్ల నష్టపోతోంది నష్టపోవాలి తప్పదు. తను తన కూతురి ఆపరేషన్ కాన్పుకి అయిన 20 వేల డాలర్లు తను ఇవ్వలేదు.

హఠాత్తుగా అతనిలో ఓ భయం తనంటే పెద్ద మొత్తం ఇవ్వలేదని తెలిసీ అతను ఎందుకు అడుగుతున్నట్టు?

ఒకవేళ....ఒకవేళ ఎలాటి ముద్దు ముచ్చట్లు తీర్చలేని తనలాటి ఓ పేదతండ్రి కన్న కూతుర్ని తన భార్య స్థానాన్నుండి తోసేయాలని చూడడం లేదుకదా!

విపరీతంగా కంపించిపోతూ వడివడిగా ఆ ఉత్తరంలోని మిగ్గిలిన నాలుగు లైన్ల వైపు చూపు సారించాడు కృష్ణమూర్తి.

భయపడకు నాన్నా! నన్ను మీ అల్లుడు వదులుకోలేడు. కాకపోతే అత్తగార్ని, మామగార్ని నొప్పించి ఆనందించేవాళ్ళలో నా భర్తా ఒకడు. మీరు నిశ్చింతగా వుండండి నాన్నా!"

తన గుండె తేలిక పడిందని భ్రమ పడ్డాడు. తను నిజానికి అతని గుండె బరువెక్కింది.

*

SCANNED

285879